# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరు వందే భారత్ రైళ్లను దృశ్య మాధ్యమ విధానం ద్వారా ప్రారంభించారు.**
2. **శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ప్రాంతంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చారు.**
3. **రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశాలు జారీచేశారు.**
4. **రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించింది. నిన్న ఒక్కరోజే 45 వేల 989 కేసులు పరిష్కారమయ్యాయి.**
5. **మన దేశ ఖ్యాతిని దశ, దిశల చాటి చెప్పి ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని ఈ రోజు ఇంజనీర్ల దినోత్సవంగా జరుపుకొంటున్నాం.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరు వందే భారత్ రైళ్లను ఈ రోజు ప్రారంభించారు. జార్ఖండ్ పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర రాజధాని రాంచీ విమానాశ్రయం నుంచి దృశ్య మాధ్యమ విధానం ద్వారా ఆయన ఈ రైళ్లకు పచ్చ జెండా ఊపారు. జెంషెడ్‌పూర్ నుంచి ప్రధానమంత్రి ఈ రైళ్లను ప్రారంభించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించక ఆయన ప్రయాణించాల్సిన హెలికాప్టర్ సిద్ధం కాలేదు. కాగా.. ప్రధానమంత్రి ప్రారంభించిన రైళ్లలో టాటానగర్–పాట్నా, బ్రహ్మపూర్–టాటానగర్, రూర్కెలా–హౌరా, డియోఘర్–వారణాసి, భాగల్పూర్–హౌరా, గయా–హౌరా మార్గాలలో ప్రయాణికులకు సేవలు అందించనున్నాయి. ఈ వందే భారత్ రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.

--------------------------

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ప్రాంతంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చారు. మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజు, శాసన మండలి మాజీ సభ్యులు గుండుమల తిప్పేస్వామి నిన్న బెంగళూరులో కేంద్రమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దులోని వెనుకబడిన శిర, మధుగిరి, హిరియూరు, పావగడ, మడకశిర ప్రజలకు అనుకూలంగా ఉండేలా పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో పరిశ్రమలు

ఏర్పడితే ఉపాధి, ఉద్యోగాలు మెరుగువుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు విశాఖ ఉక్కు పరిశ్రమ పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి వెల్లడించారు.

---------------------------

గొర్రెలు, మేకల పెంపకందారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ ముసునూరు మండలం గోగులంపాడు గ్రామంలో పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో ఈ రోజు ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గొర్రెలకు, మేకలకు నట్టలమందు పంపిణీతోపాటు పలు రకాల జీవాల ఆరోగ్యం కోసం మందులను రైతులకు మంత్రి అందజేశారు.

---------------------------

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇక నుంచి ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సబ్‌రిజిస్ట్రార్లు కూర్చునే కుర్చీ ఎత్తు తగ్గించడమే కాకుండా, వారి ముందుండే పోడియంను తీసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు వారి కంటే ఎత్తులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ పోడియం ముందు నిలబడి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకునే విధానం అమర్యాదరకరంగా ఉందని.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అంతరం పెంచేలా ఉందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి పన్నులు కడుతున్న ప్రజలకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని పేర్కొంటూ నిన్న ఆయన ఒక మెమో జారీ చేశారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. నిన్న ఒక్కరోజే 45 వేల 989 కేసులు పరిష్కారమయ్యాయి. రాజీ ద్వారా మొత్తం 64 కోట్ల 72 లక్షల రూపాయలను పరిహారంగా అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ జి.నరేందర్, హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హరి మార్గనిర్దేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాలో 377 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. ఇరువర్గాల ఆమోదంతో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. మరోవైపు రాష్ట్ర హైకోర్టు న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న 175 కేసులు పరిష్కరించి 2 కోట్ల 90 లక్షల పరిహారం అందజేశారు.

---------------------------

ఆధార్ వివరాలను ఉచితంగా నవీకరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం గడువు పొడిగించింది. గతంలో ఇచ్చిన గడువు నిన్నటితో ముగియడంతో మరో మూడు నెలలు పెంచుతున్నామని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ..యూఐడీఏఐ పేర్కొంది. ఈ అవకాశం ఈ ఏడాది డిసెంబరు 14వ తేదీ వరకు ఉంటుందని తెలిపింది. యూఐడీఏఐ నిబంధనల ప్రకారం.. ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్‌కు సంబంధించిన వివరాలను నవీకరించుకోవాల్సి ఉంటుంది. మై ఆధార్ పోర్టల్ ద్వారా మాత్రమే పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి మార్పులు చేర్పులు ఉచితంగా చేసుకోవచ్చు.

---------------------------

దేశంలో దృశ్యమాధ్యమ ప్రసార శకానికి నాంది పలికిన దూరదర్శన్ ప్రారంభమై నేటికి 65 సంవత్సరాలు పూర్తయ్యాయి. నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ 1959 సెప్టెంబర్ 15వ తేదీన దూరదర్శన్ తొలి ప్రసారాన్ని ప్రారంభించారు. 1975 వరకు ఇది ఆకాశవాణిలో భాగంగా ఉండేది. 1976 ఏప్రిల్ 1వ తేదీన, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో ప్రత్యేక శాఖగా రూపాంతరం చెందింది. ఆ తరువాత ప్రసార భారతి కిందకు వచ్చింది. ప్రసార భారతిలోని రెండు విభాగాలలో స్వయంప్రతిపత్తి కలిగిన ప్రజా సేవల ప్రసార సంస్థల్లో దూరదర్శన్ ఒకటి. స్టూడియోలు, ట్రాన్స్‌మిటర్‌ల విస్తారమైన నెట్‌వర్క్‌తో దేశంలోనే అతిపెద్ద ప్రసార సంస్థగా కొనసాగుతోంది. ప్రస్తుతం దూరదర్శన్ 24 గంటలపాటు ప్రసారాలను అందించే 35 ఉపగ్రహ ఛానెల్‌లను నిర్వహిస్తోంది. వీటిలో ఆరు జాతీయ ఛానెల్‌లు, 22 ప్రాంతీయ ఛానెల్‌లు ఉన్నాయి. పరిమిత వనరులు, పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేనప్పటికీ రామాయణం, మహాభారతం, హమ్ లాగ్, బునియాద్, మాల్గుడి డేస్, ఉడాన్ వంటి ప్రసారాలతో దూరదర్శన్ దేశ ప్రజల మన్నన పొందింది.

---------------------------

ఈరోజు ఇంజినీర్ల దినోత్సవం. ఇంజనీరుగా మనదేశ ఖ్యాతిని దశ, దిశల చాటిచెప్పి ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని ఇంజినీర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కర్నాటకలోని ముద్దేనహళ్ళిలో 1861 సెప్టెంబరు 15వ తేదీన జన్మించిన ఆయన... దేశంలో ఎన్నో ఆనకట్టలు, సాంకేతిక కట్టడాలు, వంతెనల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఇంజినీరింగ్ రంగంలో దేశానికి ఆయన అందించిన సేవలకుగాను 1955లో ప్రభుత్వం ఆయనకు అత్యున్నత “భారతరత్న” పురస్కారాన్ని అందిచేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వచ్చిన వరదలకు సంబంధించి ప్రభుత్వ సహాయక చర్యలపై 16 సర్వేలు నిర్వహించగా, అన్నింటిలోనూ 95శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వరద బాధితుల సహాయక చర్యలపై విపక్ష నేతల్లో కూడా సంతృప్తి వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ఈ వరదల్లో ప్రాణ, ఆస్తినష్టం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించిందని, ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో ఉన్నారని అచ్చెన్నాయుడు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మీ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ‘స్వచ్ఛతా హీ సేవా–2024’ కార్యక్రమం నిర్వహిస్తామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహిస్తామని వెల్లడించారు. విజయవాడలో రాష్ట్రస్థాయి భాగస్వామ్య సంస్థలతో నిన్న సన్నాహక సమావేశం నిర్వహించారు. స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత ఇతివృత్తంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గంధం చంద్రుడు వివరించారు.

---------------------------

ఉత్తరాంధ్ర సహా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి ఒక్కరికీ మధుర స్మృతులు మిగిల్చేలా విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం నిర్వహించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరం జిల్లా అధికారులను ఆదేశించారు.

=======================